కమిషనర్‌కు బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సిహెచ్ శాంతకుమారిని నియమిస్తున్నట్లు మున్సిపల్ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. కమిషనర్ శ్రీనివాస్ ఈ ఏడాది మార్చిలో ఎన్నికల సమయంలో నిడదవోలు నుంచి బదిలీపై పార్వతిపురం మున్సిపాలిటీకి కు వచ్చారు. శ్రీనివాస్‌ను మున్సిపల్ సెక్రటేరియేట్‌లో అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్‌కు బదిలీపై వెళ్లనున్నారు.

డ్వామా పీడీకి బదిలీ

డ్వామా పీడీ కె.రామచంద్రరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో ఇంకా ఎవర్ని నియమించలేదు.

సాగుభూములకు పట్టాలు ఎప్పుడిస్తారు?

కుడుమూరు గిరిజనుల ధర్నాలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

తరతరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఎప్పుడిస్తారని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ప్రశ్నించారు. సోమవారం పాచిపెంట మండలం కుడుమూరు గిరిజనులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కొన్నేళ్ల పాటు భూములు సాగు చేసిన గిరిజనులకు పెట్టాలిస్తున్నారని, అనేక ఏళ్లుగా సాగులో ఉన్న కుడుమూరు గిరిజనులకు పట్టాలు ఎందుకివ్వరని ఆయన ప్రశ్నించారు. సర్వే నెంబర్ 48లో 782ఎకరాల ప్రభుత్వ భూములను సమీపంలో ఉన్న గిరిజనులు సాగు చేస్తున్నారని చెప్పారు. సాగుపట్టాలు లేకపోవడంతో గిరిజనులకు ప్రభుత్వ రాయితీలు, బ్యాంక్ రుణాలు మంజూరు కావడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజన్నదొర గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసినా గిరిజనులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి ఉన్నందున గిరిజన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, రైతులు సూకురు అప్పలస్వామి, కొర్ర కళ్యాణ్, ఎస్.సోమయ్య పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

లైంగిక వేధింపుల కమిటీలు వేయాలి

వివిధ ప్రదేశాల్లో పని చేస్తున్న శ్రామిక మహిళలకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని కోరుతూ జిల్లా శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యాన సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న మహిళలకు కూర్చోడానికి స్టూళ్ల ఏర్పాటు చేయాలని, పని భారం తగ్గించాలని, కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.జ్యోతి, ఎస్.గౌరీశ్వరి, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, కె.వరలక్ష్మీ పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉపాధి కల్పించాలి

జిల్లాలోని వార్డు, గ్రామ వాలంటీర్లకు ఉపాధి కల్పించాలని, తిరిగి వాలంటీర్లుగా నియమించాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు ఆధ్వర్యాన వాలంటీర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు.

ఉపాధి బిల్లులు పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలి

జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి బిల్లులను సంబంధిత పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ పాచిపెంట మండలంలోని సర్పంచులు జెడ్పీ వైస్ చైర్మన్ సింహాచలం ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధంగా ఉపాధి హామీ కింద బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ, మాజీ వైస్ ఎంపిపి టి.గౌరీశ్వరరావు, సీనియర్ నాయకులు పాచి పెంట చినబాబు,ఎం.మధుసూధనరావు పాల్గొన్నారు.

ఫీజులు చెల్లించాలి

గత రెండేళ్లుగా తమకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్మెంట్ పథకం కింద డబ్బులు మంజూరు కావడం లేదని సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిజి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో ఏడాదికి రూ.80వేలు చొప్పున ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేస్తోందని విద్యార్థులు వాపోయారు. అలాగే జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని, ఎస్సీ, బిసి బాలుర బాలికల కళాశాల సొంత వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. సాలూరు బాలుర కళాశాల వసతి గృహానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్ లో ఉన్న విద్య దీవెన వసతి దీవెన నిధులను విడుదల చేయాలని కోరారు. జీవో 77ను రద్దు చేయాలని, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలని, బాలుర బాలికల వసతి గృహల్లో అదనపు భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన ఇవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పాండు, జిల్లా కమిటీ సభ్యులు హెచ్. సింహాచలం కె.డేవిడ్ జి.సురేష్ చంటి వెంకీ అభి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఎఎన్ఎంల వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని సచివాలయం ఎఎన్ఎంలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ వి.ఇందిర ఆధ్వర్యాన వారు కలెక్టర్‌ను కలిశారు. తమపై పని ఒత్తిడి పెరుగుతోందని, సచివాలయం అధికారులు, వైద్యాధికారులు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారని చెప్పారు. ఏదో ఒక శాఖ కింద పని చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిట

గడిచిన మూడు వారాలు గా గ్రీవెన్స్ సెల్ వాయిదా పడడంతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు వినతులు అందజేశారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

పెన్షన్ల దుర్వినియోగంపై కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజా పెన్షన్లను అనర్హులకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, ఐటిడిఎ ఇన్ ఛార్జ్ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ జి.కేశవనాయుడు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గరుగుబిల్లి మండలం రావుపల్లికి చెందిన కొర్నాన రమేష్ తమ గ్రామంలో మరణించిన వారికి పెన్షన్లు పంపిణీపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మరికొంతమందికి మరణానంతరం పెన్షన్లను పంపిణీ చేయగా సంబంధిత సిబ్బంది నుండి రికవరీ చేసి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పెన్షన్లు మంజూరు, పంపిణీలో అవకతవకలకు పాల్పడితే అందుకు బాధ్యులైన సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కురుపాం, పార్వతీపురం మండలాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతుందని ఫిర్యాదులు రాగా వెంటనే చర్యలు తీసుకుంటామనికలెక్టరు తెలిపారు. ఇలా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 200 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లాఉ న్నతాధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి శోభిక ఐటిడిఎ పిఒ తదితరులు

27న అడలి వ్యూ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

అడలి వ్యూ పాయింట్ పై రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తన కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న అడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అడలీ వ్యూ పాయింట్ జిల్లాలో సుందరమైన ప్రదేశమని, దీన్ని సందర్శించి అక్కడే మనోహర దృశ్యాలను తిలకించవచ్చన్నారు. ఆడలిలో కొంత సమయం గడపడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈనెల 27న అడలి వ్యూ పాయింట్, టెంటేడ్ అకామడేషన్, రెస్టారెంట్‌ను ప్రారంభించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం నాలుగు గంటల నుండి సీతంపేట అడ్వెంచర్ పార్క్ లో ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా అడ్వెంచర్ పార్క్‌లో గల 5 డి థియేటర్ ను ప్రారంభిస్తామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారని, జిల్లా వాసులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ జి కేశవ నాయుడు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ తో ప్రజాభిప్రాయ సేకరణ

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం.. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వర్ణాంధ్ర @2047 దార్శనిక పత్రం అనేది ఆర్థికాభివద్ధి, సామాజికాభివృద్ధి, వాతావరణ సుస్థిరతలపైన దృష్టి సారిస్తూ 2047 నాటికి దేశానికి ఒక స్థూలవృద్ధి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం చెందించడానికి కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశిస్తుందని ఆయన వివరించారు. నవంబరు 1న విజన్ @2047 పత్రాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములేనని, సరైన ప్రణాళిక ద్వారా ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశం కల్పించడానికి ప్రజలంతా తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. అందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా 'స్వర్ణాంధ్ర ఏ2047' పై ప్రజల ఆలోచనలను, సలహాలను కోరుతోందని చెప్పారు. http://swarnandhra.ap.gov.in/Suggestions వెబ్‌సైట్ లో స్కానర్ ఇమేజ్ డిస్ప్లే అవుతుందని తద్వారా అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర విజన్ పోస్టర్‌ను విడుదల చేశారు. మండల ప్రత్యేక అధికారులు గ్రామ, మండల స్థాయిలో పర్యటించి మంచి ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, సిపిఒ పి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా సిహెచ్.సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న అధికారి సత్యనారాయణను ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం మేనేజర్ రాఘవాచార్యులు ఇంచార్జి కమిషనర్ గా వున్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన కానిస్టేబుల్ అభ్యర్థులు

కదంతొక్కిన కానిస్టేబుల్ అభ్యర్థులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ • కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని సుప్రీంకోర్టులో ఉన్న కేసును క్లియర్ చేయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు వేలాదిమంది పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. గంట పాటు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బయట బైటాయించినా అధికారులు, కలెక్టర్ బయటకు రాకపోవడంతో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసు అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. అనంతరం బైఠాయించిన అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులతో డిఎస్‌పి మాట్లాడి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కి నోటిఫికేషన్ 2022లో ఇచ్చి మూడేళ్ల అవుతున్నా ఇంకా మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే 95వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారని, ఉత్తీర్ణులైన వారికి మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నేటి వరకు నిర్వహించలేదన్నారు. ఎన్నేళ్ళు ఉద్యోగాల కోసం అభ్యర్థులు వేచి చూడాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి తప్ప మా పోస్టులు భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టులో కేసు ఉందని చెప్పి ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకుండా అభ్యర్థులతో ఆడుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఉన్న కేసును క్లియర్ చేసి మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, నాయకులు సతీష్, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- 1న ఐద్వా ఆధ్వర్యాన చలో కలెక్టరేట్
- ఈనెల 25 నుండి 28 వరకు దీక్షలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణానికి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తరాలు మారినా నీటి రంగు మారడంలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్జీవో హెూంలో పట్టణంలో గల పలు వార్డుల మహిళలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు ఎం.గౌరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణం జిల్లా కేంద్రమని, యావత్తు జిల్లా యంత్రాంగం మొత్తం పట్టణంలో తిష్ట వేసుకుని కూర్చుందని, సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగల్లా అక్కడే నిలిచిందని శ్రీదేవి విమర్శించారు. పట్టణానికి మంచినీరందించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వాలు నిలిచాయని వాపోయారు. మంచినీటి సమస్య ఈనాటిది కాదని అనేక ఏళ్లుగా పట్టణ ప్రజలకు పెనుభూతములా పట్టిపీడిస్తుందన్నారు. సమస్యను అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ పరిష్కరించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. నాగావళి, జంఝావతి రెండు జీవ నదుల చెంతనే పారుతున్నా పట్టణ ప్రజలకు ప్రతి రోజూ తాగునీరందివ్వలేని స్థితిలో ప్రభుత్వాలు ఉండడం శోచనీయమని అన్నారు. వారానికి ఒకసారి మాత్రమే నీరు ఇస్తున్నారని, ఇచ్చే నీరు కూడా బురద నీరేనని అన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న మహిళలు, పట్టణ ప్రజలు

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణంలో పెరిగిన జనాభాకు, అవసరాలకు సరిపడా తాగునీరు, మౌలిక సదుపాయాల్లేక చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. గణేష్ కాలనీ, ఎస్ఎన్‌పి కాలనీ, జల శక్తి కాలనీ, సౌందర్య నారాయణమూర్తి కాలనీ, బైపాస్ కాలనీ, బెలగం అపార్ట్మెంట్ల కాలనీ మరియు యర్ర కష్ణ కాలనీల్లోని కొన్ని వీధులకు పూర్తిగా పైపులైన్ల కలెక్షన్లు లేవని తెలిపారు. పట్టణంలోని కుళాయిలకు నీరు సక్రమంగా రావడంలేదని, మరికొన్ని కుళాయిలకు నీరు రాకపోయినా మున్సిపల్ కుళాయి పన్ను బలవంతంగా వసూలు చేపడుతున్నారని అన్నారు. ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. పట్టణ జనాభా గత పదేళ్లలో రెట్టింపు పెరిగిందని, అందుకు తగ్గట్టుగా ప్రజలకు సరిపడా నీటి సరఫరా మాత్రం అందడంలేదన్నారు. పట్టణం నలుదిశలా విస్తరిస్తున్న నేపథ్యంలో పట్టణ జనాభా బాగోలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఒకనొక సందర్భంలో ప్రభుత్వం బాధ్యతను విస్మరిస్తే ప్రజలే తలపడి సాధించుకోవాలని అన్నారు. అనంతరం తమ తమ వీధుల సమస్యలపై పలు మహిళలు మాట్లాడుతూ బురద నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు చాలా తీవ్రంగా వెంటాడుతుందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

మంచినీటి సమస్య పరిష్కారం కోరుతూ ఈనెల 25 నుండి 28 వరకు కలెక్టరేట్ ఎదుట రిలే నిరహార దీక్షలు, అక్టోబర్ 1న చలో కలెక్టరేట్ నిర్వహించేందుకు తీర్మానాన్ని రౌండ్ టేబుల్ ఆమోదించింది. ఈ కార్యక్రమాలకు పట్టణంలోని మహిళలు, పెద్దలు, మేధావులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఐలు, ఐద్వా నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ, జి.తులసి, మాధురి పాడి, జయలక్ష్మి, నారాయణమ్మ, పట్టణంలోని పలు వార్డుల మహిళలు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పార్వతీపురంరూరల్ : బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్పీ ఎస్పీ మాధవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బాణసంచా నిల్వలు, విక్రయాలు, తయారీ చేసే అనుమతులు ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రత ప్రమాణాలు, లేనిది రక్షణ చర్యలు చేపడుతున్నది లేనిది పరిశీలించాలని సూచించారు. ఇతర శాఖల అధికారులతో జాయింట్ తనిఖీలు నిర్వహించాలన్నారు. అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌కు మాతృవియోగం

పార్వతిపురం టౌన్ : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ మాతృమూర్తి విజయలక్ష్మి విశాఖపట్నంలో సోమవారం తుది శ్వాస విడిచారు. ఆయన స్వస్థలమైన బెలగాం నాయుడు వీధిలో ఆమె భౌతికకాయాన్ని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె భౌతికయానికి పట్టణంలో ఉన్న ప్రముఖులతోపాటు, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు.

28న మన ఇళ్లు -మన గౌరవం

ప్రజాశక్తి - పార్వతీపురం

మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మన ఇళ్లు- మన గౌరవం, స్వర్ణ ఆంధ్ర తదితర కార్యక్రమాలపై జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇళ్లు- మన గౌరవం కార్యక్రమం కింద ఇప్పటికే మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి లోగా పూర్తి చేసుకోవాలన్నారు. అప్పటికి పూర్తి చేయకపోతే మంజూరైన ఇళ్లు రద్దు అవుతాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణం వేగవంతానికి మండల ప్రత్యేక అధికారులు మంగళ, బుధవారాల్లో మండలాల్లో పర్యటించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 28న లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలను ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రారంభించ వచ్చని తెలిపారు. ఎఎన్ఎం సేవలను వారి రెగ్యులర్ వైద్య సేవలకు వినియోగించాలని, ఇతర అవసరాలకు వినియోగించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వ పాలన : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజల అభీష్టం మేరకే కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మండలంలోని పాంచాలిలో సర్పంచ్ గూడెపు యుగంధర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. తొలుత గ్రామస్తులు మంత్రికి గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రూ.35 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో కాలువలు, రోడ్ల నిర్మాణం, శివాలయం వద్ద ఉన్న చెరువు సుందరీకరణ, జల్ జీవన్ పథకం ద్వారా గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు, జడ్పీ హైస్కూల్లో కొన్ని తరగతి గదులు నిధులు కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయావని, నిధులు మంజూరు చేసి తరగతి గదులు పనులు పూర్తిచేయాలని మంత్రి దృష్టికి సర్పంచ్ తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ వరద బాధితుల కోసం పాంచాలి హై స్కూల్ విద్యార్థులు రూ.7వేలు మంత్రి సంధ్యారాణికి అందించగా, విద్యార్థులను ఆమె మంత్రి అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన, మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, నాయకులు ముఖీ సూర్యనారాయణ, చల్లా కనక, కె.సురేష్, ఎంపిటిసి సభ్యులు పల్లేడ ఉమా, పి.ఉమామహేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. అలాగే నర్సిపురం గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, గొట్టాపు వెంకటరమణ, జనసేన నాయకులు ఆగూరు మణి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గ్రీన్ అంబాసిడర్లకు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

గ్రీన్ అంబాసిడర్ ఆరోగ్యంగా ఉంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి అన్నారు. సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లతో పాటు వారి కుటుంబ సభ్యులకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మంత్రి

సాలూరురూరల్: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష ఉచిత వైద్యశిబిరాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సమాజంలో నిరంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం శ్రమిస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు అన్ని గ్రామాలకు చెందిన కార్మికులకు స్థానిక ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం వద్ద సఫాయి మిత్ర సురక్ష ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

రైతులకు మినుము విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా 50 మంది రైతులకు మినుము విత్తనాలను కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మినుములో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంత విహారి, జి.అచ్చుత విహారి, రైతులు పాల్గొన్నారు.

వందరోజుల పాలన పై ఇంటింటికీ కరపత్రాలు

ప్రజాశక్తి- మక్కువ

మక్కువలో టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచిన సందర్భంగా సోమవారం మండలంలోని 21 సచివాలయాల పరిధిలోని 35 గ్రామపంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం అందజేసిన గోడపత్రికలను ఆయా గ్రామాల్లోని నాయకులు, అధికారులు ఇంటింటికీ అతికించారు. టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కార్యకర్త విరాళం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విజయవాడ వరద బాధితులకు సీతానగరం మండలం గాదివలసకు చెందిన మాజీ ఎంపిపి బొన్నాడ శ్రీరాములు, సత్యనారాయణ రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ నగదులను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగతా నాయకులు కూడా స్పందించి బాధితులను ఆదుకోవాలని కోరారు.

జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

సవర భాష విద్యా వాలంటీర్ల జీతాలు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు, నాయకులు ఎల్లాంగో, ఆనందరావు, భారతి తదితరులు డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం జూలై నుండి సెప్టెంబర్ వరకు మూడు నెలలు జీతాలు చెల్లించాలన్నారు. ఐటిడిఎ పరిధిలో 153 మంది వివిధ ప్రాథమిక పాఠశాలల్లో సవరభాష విద్యా వాలంటీర్లు పనిచేస్తున్నారని, వీరి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని, కావున తమకు వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని కోరారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక వైటిసిలో స్వచ్ఛభారత్ మిషన్‌పై మహిళకు నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత లేకపోతే మానవ జాతి ఆరోగ్యం ముప్పులో పడుతుందన్నారు. బహిరంగ మలవిసర్జన వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, దాని ద్వారా నీరు, పరిసరాలు కాలుష్యమై మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. స్వచ్ఛత అనేది ఆరోగ్యకరమైన జీవితానికి, పరిశుభ్ర ఆహారానికి, మంచి నీటి వనరులకు అను సంధానమై ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైటిసి, నీడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపిపి తదితరులు

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి - పాచిపెంట

మండల పరిషత్ అధికారి పి.లక్ష్మీకాంత్ తన సొంత జిల్లా చిత్తూరు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఇక్కడ తన రెండేళ్ల ఉద్యోగ ప్రస్థానంలో మండలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాల గురించి పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం ఘనంగా దుస్సాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పి.వీరంనాయుడు, నాయకులు గొట్టాపు ముత్యాల నాయుడు, దండి ఏడుకొండలు, కె.రవీంద్ర, టి.గౌరీశ్వరరావు, పి.వేణుగో పాలరావు ఎఒ పాత్రో, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు. సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పాఠశాలలకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అన్ని పాఠశాలలకు కూరగాయలు, ఆకు కూరల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. సోమవారం ఎంఇఒ కార్యాలయం వద్ద వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మెనూతో పాటు, విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో బడి తోట కార్యక్రమం ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో అమలు చేస్తున్నారన్నారు. పాఠశాలల ఆవరణలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - భామిని

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం శాంతి నగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో భామిని జిల్లా పరిషత్ హై స్కూల్‌కి చెందిన విద్యార్థి ప్రవీణ్ ప్రతిభ కనబరిచారు. అండర్ -19 విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరావు, ఇతర సిబ్బంది ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు. ప్రవీణ్ కుమార్ స్వగ్రామం పసుకుడి కావటంతో, ఆ గ్రామ సర్పంచ్ బెవర భార్గవనాయుడు ప్రవీణ్‌కి అభినందనలు తెలిపారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

చట్ట పరిధిలోని అర్జీలు సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను పరిశీలించారు. ఆ ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. సదరు ఫిర్యాదులను "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 15 ఫిర్యాదులు అందాయి. డిసిఆర్‌బి సిఐ జిడి బాబు, ఎస్ఐ పాపారావు, పాల్గొన్నారు.

వినతులు త్వరగా పరిష్కరించండి

సీతంపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. గ్రీవెన్స్ డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 87 వినతులు వచ్చాయి. వీటిలో కొన్ని... వలసగూడ చెందిన సుబ్బారావు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఆంపురం చెందిన జగన్నాయకులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. మెలియాపుట్టి చెందిన పోలయ్య సోలార్ వ్యవసాయ బోరు మంజూరు చేయాలని, టికిపాయిగూడ చెందిన ఆనంద్ వీధి కాలువలు నిర్మించాలని విన్నవించారు. కోడుమ సాయి చెందిన హరి నూర్పిడి యంత్రం మంజూరు చేయాలని, మనుమకొండ చెందిన నిరోష మినీ గ్రూపులో టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, డిఇలు నారాయణ, గోపాలకృష్ణ, కృష్ణకుమార్, డిప్యూటీ డిఇఒ పాలక నారాయణ, పిహెచ్ఒ, ఎంఒ కోటి బాబు, ఎటిడబ్ల్యుఒ మంగవేణి పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

పీసా ఎన్నికలు వాయిదా

సీతంపేట: షెడ్యూల్ ప్రాంతాల్లో నిర్వహించబోయే పీసా ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసిందని ఐటిడిఎ పిఒ సి యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎన్నికల తేదీని ప్రకటిస్తామని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని కోరారు.

గుర్రపు డెక్కను తొలగించాలి

పార్వతీపురంరూరల్: తోటపల్లి జలాశయంలో పేరుకుపోయిన గుర్రపుడెక్క వల్ల దానిమీద ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని రాష్ట్ర నిర్వాసితుల సంఘం అధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి జలాశయంలో నిర్వాసిత గ్రామాలకు చెందిన మత్స్యకారులు శ్రీ వెంకటేశ్వర గిరిజన మచ్చ పారిశ్రామిక సహకార సంఘం పేరుతో సుమారు 30 గ్రామాలకు చెందిన 450 కుటుంబాలు గత 15 సంవత్సరాల నుండి తోటపల్లి బ్యారేజీలో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సహకారంతో చేప పిల్లలు బ్యారేజీలో పెంపకం చేసి అవి పెద్దవి అయిన తర్వాత పట్టుకోవడానికి ఈ గుర్రపు డెక్క వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, చేపల దిగుబడి ఎదుగుదలపై గుర్రపు డెక్క తీవ్ర ప్రభావం చూపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు ఈదల తిరుపతి పాల్గొన్నారు.

ఏజెన్సీ పంచాయతీలన్నింటికీ పీసా ఎన్నికలు

పార్వతీపురం: జిల్లాలోని 299 గిరిజన గ్రామ పంచాయతీల్లోనూ పీసా ఎన్నికలు నిర్వహించాలని ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎజెఎసి నాయకులు ముక్క సీతారాం, కొండగొర్రి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కేవలం 77 గిరిజన గ్రామ పంచాయతీలకు మాత్రమే పీసా చట్టం కింద ఎన్నికలు జరుపుతుండడం అన్యాయమన్నారు. పీసా చట్టం కింద వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఎన్నికల నిర్వహణకు ఐటిడిఎ పరిధిలో ఉన్న 8 మండలాల ఎంపిడిఒలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. పంచాయతీలకు గిరిజన సంక్షేమ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు బహిర్గతం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని 1496 గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలని, కొన్ని మాత్రమే షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టం కింద గుర్తించడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు పల్లా సురేష్,అన్నారం పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట, ఐటిడిఎలో జిల్లా స్థాయి ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆడలి వ్యూ పాయింట్‌ను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆడలి వ్యూ పాయింట్‌ను ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను చేయాలని సిబ్బందికి సూచించారు. ఆ రోజు ఉదయం ఆడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభించి, అనంతరం మధ్యాహ్నం 4 గంటలకి ఎన్‌టిఆర్ అడ్వాంచర్ పార్క్‌లో పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, ఈఈ సింహాచలం, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

విడివికెల పనితీరు మెరుగుపర్చాలి

ఐటిడిఎ పరిధిలోని విడివికెల పనితీరును మెరుగు పర్చాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడివికెల వారీగా లక్ష్యాలను నిర్దేశించి, వాటిని ఆదుకునే దిశగా కృషి చేయాలన్నారు. విడివికె ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. అన్ని విడివికెలను పరిశీలించి పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో సమావేశాలను నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఎపిడిఒ ఎం.సన్యాసిరావు, డిపియం ఆర్.వి.రమణ, ఎపియంలు విజయ కుమారి, సీసీలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూరంపేటలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండలంలోని సూరంపేటలో ఎఒ ఎస్.అవినాష్ ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తాడు ఉడుపు ద్వారా ఉడిచిన వరి పంటను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ తూర్పు, పడమర దిశలో తాడు ఉడుపు వేయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. అలాగే వరి నాట్లు వరుసల్లో వేసుకోవడం వల్ల మొక్కలు, కుదుళ్ల మధ్య తగినంత దూరం ఉండడం వల్ల దిగుబడి అధికంగా వచ్చు అవకాశం ఉందన్నారు. తాడు ఉదుపు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి, పంట దిగుబడిని పెంచుకోవడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చవచ్చన్నారు. ఈ విధానం వల్ల మొక్కల మధ్య, వరుసల మధ్య కాలి ఉండటం వల్ల కలుపు నివారణకు సస్యరక్షణ చర్యలు చేయుటకు సులభంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

నేటి నుంచి పొలం పిలుస్తోంది..

మండలంలోని మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే జయకృష్ణ కిల్లాడ గ్రామం జరగనున్న కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్తారన్నారు. ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖలు అధికారులు పాల్గొంటారని చెప్పారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి : సిపిఐ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రి వెనుక ఉన్న వీధులు, గూడ్స్ షెడ్ సెంటర్ రోడ్డు వీధుల్లో సిపిఐ బృందం పర్యటించింది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల కాలువల్లో వాడుక, మురుగు నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో వీధిల్లోనే నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారడంతో, విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఈ వీధి ప్రజలు సిపిఐ నాయకులు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, పట్టణంలో పారిశుద్ధ లోపం ఉందని, ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, పువ్వాల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజకీయ కక్ష సాధింపు దారుణం : జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చిరుఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలను పాల్పడడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెడ్ బుక్ పాలన కొనసాగుతుందని, అందుకు జిల్లా యంత్రాంగం కూడా పచ్చ చొక్కాలు వేసుకొని వారికి వత్తాసు పలకడం దౌర్భాగ్యమన్నారు.విఒఎలను, ఫీల్డ్ అసిస్టెంట్లను అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఇలాంటి చర్యలు చోటు చేసుకోవడం, వాటికి అధికార యంత్రాంగం వత్తాసు పలకడం ఆపాలని, లేకుంటే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిని అందజేసిన వారిలో ఎంపిపి మజ్జి శోభారాణి, జడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు బి.రమేష్, కె.బాలకృష్ణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు, కౌలురైతుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం, కౌలు రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ధరల స్థిరీకరణ, పంట నష్టం బీమా, పంట పెట్టుబడి రూ.20 వేలు తక్షణమే అందించాలి డిమాండ్ చేశారు. 2022 -23లో ధాన్యం సరఫరా చేసిన రైతులకు కళాసీ, రవాణా ఛార్జీలు చెల్లించాలని, రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీవో 22 రద్దు చేయాలని, జంఝావతి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మించి సీతానగరం మండలానికి సాగునీరివ్వాలి, వెంగళరాయ సాగర్ కాలువనీరు కోట సీతారాంపురం, జానుమల్లవలస గ్రామాల శివారు ఆయకట్టు భూములకు ఎక్స్టెన్షన్ కాలువ ద్వారా నీరు ఇవ్వాలి, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకు రుణ సదుపాయం అందించాలని, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం ఇప్పించాలని, మూతపడిన లచ్చపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ప్రభుత్వమే నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రైతులు బొరపరెడ్డి అప్పారావు, పైల కాశీవిశ్వనాథం, రెడ్డి సత్యనారాయణ, పాలక సత్యం, పి.ఎరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు, సంఘాల నాయకులు

కార్మికవర్గంపై మోడీ దాడి

ప్రజాశక్తి - వీరఘట్టం

మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి చేస్తుందని, ఎఐసిసిటియు ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు వి.మణికంఠ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు బ్లాక్ డే సందర్భంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో కార్మికుడుకూ నెలకు పదివేల రూపాయలు చెల్లించాలని కార్మికుని పిల్లలకు విద్యా వైద్య ఉచితంగా కల్పించాలని, ఇన్సూరెన్స్ తప్పకుండా అమలు చేయాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సోమనాయుడు, దనక ప్రసాదు, కే వరహాలు నాయుడు, వ్యవసాయ కార్మిక నాయకులు గ్రంధి సూర్యారావు, జిల్లా నాయకులు ఎన్ విటలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతన్న కార్మికులు

నేడు పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

జాబ్ మేళా కార్యక్రమాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాను ఉదయం 9.30 గంటల నుంచి స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాలో అవంతి ఫీడ్స్ లిమిటెడ్ వంద మంది ప్రాసెసింగ్ వర్కర్లను నియమిస్తుందని, ఇందుకు కనీస విద్యార్హత ఏమీ లేదని, 18 నుంచి 35 ఏళ్ల కలిగిన యువతీ యువకులు అర్హులన్నారు. ఎర్రవరంలో పనిచేయాల్సి ఉందని, వేతనం రూ.11,500 చెల్లిస్తారని తెలిపారు. అరబిందో ఫార్మా, కంపెనీ ఆంధ్రా, తెలంగాణలో పనిచేసేందుకు 400 అప్రెంటీస్ పోస్టులను భర్తీ చేస్తుందని, ఇందుకు 35 ఏళ్లలోపు గల పురుషులు అర్హులని తెలిపారు. మెకానికల్‌లో డిప్లొమా, బిఎస్‌సి (కెమిస్ట్రీలో) ఉత్తీర్ణ లేదా ఉత్తీర్ణులు కాని వారు కూడా అర్హులన్నారు. వేతనం రూ.13 వేలు నుంచి రూ.16,500 వరకు ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే జిఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ 40 మంది సెక్యూరిటీ గార్డులను నియమిస్తుందని చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 166 సెంటి మీటర్ల కనీస ఎత్తుగల, 19 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల పురుషులు అర్హులని తెలిపారు. వేతనం రూ.14 వేలు చెల్లిస్తారన్నారు. కావున ఆసక్తి గల యువత మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులకు ఎన్‌టిఆర్ జలసిరి బోర్లు ఇవ్వాలి

ప్రజాశక్తి కొమరాడ

ఎన్టీఆర్ జలసిరి పథకం కింద రైతులకు విద్యుత్తు పంపు సెట్లు, బోర్లు రైతులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ వ్యవసాయ పంపు సెట్లు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కొమరాడలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014లో టిడిపి ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకం కింద విద్యుత్తు సోలార్ పంపు సెట్లు రైతులకు ఇచ్చి ఆదుకున్నారో అదే విధంగా కూట మిలో ప్రభుత్వం మళ్లీ రైతులకు విద్యుత్ పంపు సెట్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘ నాయకుల లక్ష్మయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివ నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారా, మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 728 లీటర్ల నాటు సారాను, 683 మద్యం సీసాలను సోమవారం పాలకొండ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.రాంబాబు పర్యవేక్షణలో చినమేరంగి సమీపాన ఎస్ఐ పి.అనిష్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో తొక్కించి నిప్పంటించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో రెండు పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - కురుపాం

పాత కక్షలతో మద్యం మత్తులో ఈనెల 13 తెల్లవారు జామున కురుపాంలోని గౌడు వీధిలో ఇంట్లో నిద్రిస్తున్న గౌడు శ్రీధర్(24)ను అదే వీధికి చెందిన గౌడు లల్లు(రవి) దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీధర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీధర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీధర్‌కు భార్య, కుమార్తె, తల్లిదండ్రులున్నారు.

సీతాఫలాలకు భలే గిరాకీ

వారపుసంతలు, రోడ్ల వెంబడి విరివిగా దుకాణాలు

గిరిజన రైతులకు అదనపు ఆదాయాన్నిచ్చే ఫలాలు

వెంటాడుతున్న దళారులు బెడద

ప్రజాశక్తి- కురుపాం

రుచి, నాణ్యతలో మిన్నగా ఉండే మన్యంలోని సీతాఫలాలకు మంచి గిరాకీ ఉంది. ఏటా సెప్టెంబర్, అక్టోబర్‌లో సీజనల్‌గా సీతాఫలాలు లభిస్తాయి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం వారపుసంతల్లో కావిడిలు, బుట్టలతో గిరిజన రైతులు వీటిని విక్రయానికి తెస్తుంటారు. కావిడి సీతాఫలాలకు రూ.800 నుంచి రూ.1200 వరకు ధర పలుకుతుంది. విశాఖ, కొత్తవలస తదితర మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చి భారీస్థాయిలో సీతాఫలాలను కొనుగోలు చేసి తరలిస్తుంటారు. మైదాన ప్రాంతంలో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో కురుపాం ఏజెన్సీలోని సీతాఫలాలను కొనేందుకు వ్యాపారులు ఎగబడి వస్తుండడం విశేషం. చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరూ అమిత ఇష్టంగా తినే సీజనల్ సీతాఫలంలో పోషకాలు మెండుగా ఉండడంతో పాటు గుండెపోటు, మధుమేహం, రక్తహీనత, ఆస్తమా వంటి పలు అనారోగ్య సమస్యలకు చక్కటి ఔషధంగా గుర్తింపు ఉండడంతో వీటికి భలే డిమాండ్ ఉంటుందనే చెప్పాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉండేందుకు వీలుగా స్థానిక గిరిజన రైతులు రోడ్ల వెంబడి బుట్టలతో ఉంచి అమ్మకాలు సాగిస్తుంటారు. అటుగా వచ్చిన వారంతా సీతాఫలాల దుకాణాల వద్ద ఆగి ఎన్నో కొన్ని కొనకుండా వెళ్లారంటే అతిశయోక్తి కాదు. గిరిజన గ్రామాల్లో జంక్షన్ తదితర ప్రాంతాల్లో సీజన్లో రోడ్డు వెంబడి ఇరువైపులా సీతాఫలాల దుకాణాల దర్శనమివ్వడం ఇక్కడ పరిపాటి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలల్లో దురుబిల్లి, గుణదతీలేసు, వాడపుట్టి, గొందిలోవ, కోటకొండ, ఈతమానుగూడా, ఆగంగూడా, తిత్తిరి పులిపుట్టి, కీడవాయి, గోరడ చాపరాయి భిన్నడి, గుల్లంక తదితర గ్రామాల్లోని గిరిజన రైతులు సీతాఫలాల తోటలు పెంపకానికి మొగ్గు చూపుతున్నారు.

సాంప్రదాయ పంటలకు వచ్చే ఆదాయంతో పోలిస్తే, కనీసస్థాయి పెట్టుబడి యాజమాన్య పద్ధతులతో పండించే సీతాఫలాల సాగుతో గిరిజన రైతులకు రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడం ద్వారా వారికి ఆర్థిక ఆసరాగా సీతాఫలాలు ఉంటున్నాయి.

అమ్మకానికి సిద్ధంగా ఉంచిన సీతాఫలాలు